**రేడియో సీరియల్ - 8**

**"ఆశా కిరణాలు"**

దచన మూలం: అభయ్ ఎస్.డి. రాజ్‌పుట్

స్వేచ్ఛానువాదం: షేక్ గౌస్‌బాషా, అధ్యాపకులు

**-: పాత్రల పరిచయం :-**

**మిస్టర్ గణాంక్ (గ) - తండ్రి, ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి - 45 సం॥**

**డాక్టర్ కోమలి (కో) - తల్లి, సైన్స్ అధికారిణి - 40 సం॥**

**కుమారి అపూర్వ (అ) - కుమార్తె, విద్యార్థిని - 15 సం॥**

**చిరంజీవి దీక్షిత్ (దీ) - కుమారుడు, విద్యార్థి**

**డాక్టర్ రాబర్ట్ (రా) - కోమలిగారి సహ ఉద్యోగి (పర్యావరణ విద్య ఆచార్యులు)**

**నేపథ్యం**

గణాంక్ కుటుంబం విశాఖపట్టణంలో ఉంటుంది. 'మన్నికైన అభివృద్ధి' గురించి జరుగుతున్న అంతర్జాతీయ సమావేశానికి హాజరయ్యేందుకు రాబర్ట్ విశాఖకు వస్తాడు.

ఈ ఎపిసోడ్ నందు 'మన్నికైన అభివృద్ధి' గురించి మరింత విపులంగా చర్చిస్తాము. నీరు, శక్తి వినియోగం, విపత్తుల నిర్వహణ, సేంద్రియ వ్యవసాయం, స్మార్ట్ నగరాలు, వ్యాధుల నుంచి రక్షణ వంటి అభివృద్ధి అంశాలనన్నింటి గురించి చర్చిస్తాము.

**టైటిల్ సాంగ్**

దృశ్యం

ట్యాక్సీ వచ్చి ఆగిన శబ్దం. గేటు తెరచుకుంటున్న శబ్దం. బూటు అడుగుల చప్పుడు క్రమంగా పెరుగుతుంటుంది. డాక్టర్ రాజేష్ కోమలిగారి ఇంటివైపు వస్తూంటాడు. సాయం సమయపు పక్షుల కిలకిలారావాలు వినిపిస్తుంటాయి.

కోమలి (కో) : (ఇంట్లోనుండి గేట్ వైపు గమనిస్తూ) గణాంక్.. గణాంక్... ఎవరు వస్తున్నారో గమనించారా? ఓసారి గేట్ వైపు చూడండి. (అంటూ ఆశ్చర్యంగా... సంతోషంగా ప్రశ్నిస్తూ ఉంటుంది).

గణాంక్ (గ) : ఆ..ఆ.. చూస్తున్నా... ఎవరబ్బా? రాబర్ట్ లాగున్నారే. (కుక్క మొరుగుతున్న శబ్దం. అడుగుల చప్పుడు పెరుగుతూ ఉంటుంది).

రాబర్ట్ (రా) : హాయ్! హలో గణాంక్! సంధ్యా వందనాలు ఎలా ఉన్నారు?

గ : నమస్కారం! ఆచార్య రాబర్ట్ గారికి స్వాగతం. బహుకాల దర్శనం. మనం కలుసుకొని ఏడెనిమిది సంవత్సరాలై ఉంటుందేమో!

రా : అవునవును. ఏడు సంవత్సరాలు.

గ : ఏంటి? అకస్మాత్తుగా...?

కో : ఏంటండీ? గేట్ వద్దే కుశల ప్రశ్నలా? రాబర్ట్.. ప్లీజ్ కం.. ఎలా ఉన్నారు? చాలా ఆనందంగా ఉంది. మీ రాక మాకు ఆనందదాయకం. మీ జీవితచక్రం ఎలా నడుస్తున్నది? మీ కుటుంబ సభ్యులెలా ఉన్నారు?

గ : నాకు చెప్పి నువ్వు చేస్తున్నదేమిటి? లోనికి రానీ.. రాబర్ట్.. ముందు కూర్చోండి. (కూర్చుంటున్న శబ్దం)

రా : వందనాలు కోమలీ.. చాలా సంతోషం. ఏం మారలే... అలాగే ఉన్నారు.

కో : విశ్వవిద్యాలయంలో విభాగాధిపతిగా ఉంటూ డీన్‌గా కూడా చేస్తున్నారా? అయినా మీరు అర్హులు, న్యాయం చేస్తారు కూడా.

రా : థ్యాంక్యూ... కోమలీ!

(అపూర్వ – దీక్షిత్‌ల ప్రవేశం)

దీ+అ : నమస్కారం మామయ్యా! ఎలా ఉన్నారు? మా ఇంటికి స్వాగతం... (ఇద్దరూ కలిసి ఒక్కసారిగా)

రా : హాయ్! నమస్కారం! పెద్దవాళ్ళయి పోయారా...! మీ చదువులు ఎలా ఉన్నాయి?

గ : రాబర్ట్‌గారూ! మీరొక్కరే రావడం బాధగా ఉంది. కుటుంబ సమేతంగా వచ్చివుంటే మేమంతా ఇంకా ఆనందించేవాళ్ళం.

కో : మిస్టర్ రాబర్ట్! చివరిసారి వచ్చినపుడు మాకు వాగ్దానం కూడా చేసున్నావ్! మరచావా? కాలేజీ రోజుల్లో ఉన్నట్లే ఏం మారలా? (అంటూ నవ్విస్తుంది).

రా : (నవ్వుతూ) కోమలీ! మన కాలేజీ రోజులు నువ్వింకా మరచినట్లు లేదు. ఇప్పుడు నేను చాలా మారాను. అనుకోకుండా రావడం కారణంగా కుటుంబంతో రాలేక పోయాను. అందునా పిల్లలిద్దరు పరీక్షలు వ్రాస్తున్నారు. అయితే త్వరలోనే మీ అందరి ఆకాంక్ష తీర్చేస్తా. ఇప్పటికే రాబోయే సెలవులకు ఇక్కడికి రాడానికే ప్రణాళిక వేసుకున్నాము.

అ : వావ్! మామయ్యా! థ్యాంక్స్. అనీష్ మరిఉ అనిష్కలు ఇద్దరు వస్తున్నారు కదా! నాన్నా! ఆంటీవాళ్ళు వచ్చినపుడు అరకు కూడా వెళ్దాం.

దీ : అద్దాల రైలులో వెళ్దాం. (బిగ్గరగా).. (అందరూ నవ్వుకుంటారు).

రా : అవును మంచి ఐడియా! ముందు నాకు మాటివ్వండి అనీష్, అనీష్కలకు ముందు విశాఖపట్టణం చూపిస్తామని.

దీ : తప్పకుండా మామయ్యా! చాలా ఉన్నాయి చూడటానికి. బీచ్, కైలాస పర్వతం, హార్బర్, సబ్‌మెరైన్, శిల్పారామం... చాలా చాలా ఉన్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా.

అ : అమ్మా! మీ సైన్స్ సెంటర్ కూడా అక్కడే కదా?

దీ : ముందు మేము సైన్స్ సెంటర్‌కి వెళ్తాం.

గ : మంచి ప్రణాళికే వేసుకున్నారు. అలాగే కానివ్వండి. మీతోపాటు మేమూ ఉంటాం. ముఖ్యంగా సైన్స్ కేంద్రాన్ని కోమలి ఎలా అభివృద్ధి చేసిందో చూచి తీరాల్సిందే.

రా : అవునా! అయితే తప్పక చూద్దాం.

కో : తప్పకుండా రండి. పిల్లలకు తప్పనిసరిగా మా సైన్స్ కేంద్రంలో పెద్ద పెద్ద శాస్త్రీయ అంశాలను అందరికీ అర్థమయ్యేలా సూక్ష్మం చేశాము. ఓసారి మీరందరూ దర్శించాల్సిందే.

రా : మీ కేంద్రం గురించి, నీ ప్రతిభ గురించి దినపత్రికలో కూడా చదివినట్లు గుర్తు.

కో : అవును. నిజమే. శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగారు వచ్చినపుడు మా కేంద్రం గురించి రాశారు.

రా : డైనోసార్ మోడల్ కూడా ఉందట కదా!

దీ : అవి బ్రతికున్నాయా? డైనోసార్లు చాలా చాలా పెద్దవంట కదా? బ్రతికున్నది చూడాలి.

అ : (నవ్వుతూ) అరేయ్ తమ్ముడూ! డైనోసార్‌కి ఆకలై నిన్ను తినేస్తే?

దీ : మనిషి అనుకుంటే ఏదైనా సాధిస్తాడు. ఏనుగుల్ని మచ్చిక చేసుకున్నాం కదా! అలాగే డైనోసార్‌ని కూడా!

అ : నిజమే కానీ అవిప్పుడు బ్రతికి లేవే... వేలాది, లక్షలాది సంవత్సరాల క్రితమే అవి అంతరించాయి.

దీ : అది ఎలా జరిగింది? ఆశ్చర్యకరం. పెద్ద పెద్ద జంతువులన్నీ మనుగడ సాగించలేక పోయాయెందుకని?

రా : అపూర్వా! చాలా సమాధానాలున్నాయి. చాలా సిద్ధాంతాలు కూడా ఉన్నాయ్! అననుకూల వాతావరణం కారణంగా అంతరించి పోయాయనేది ఎక్కువమంది వాదన. నిజం ఏంటో శాస్త్రవేత్తలు శోధిస్తున్నారు.

కో : రేయ్ దీక్షిత్! జురాసిక్ పార్క్ సినిమా చూశాం కదా! అది డైనోసార్‌ల గురించే కదా!

అ : అవునమ్మా! ఆ సినిమా అంటే నాకు చాలా ఇష్టం. ఆసక్తిగా ఉంటుంది.

దీ : అమ్మా! ఆ సినిమా చూస్తూ అక్క ఏడ్చింది కూడా. నాకు గుర్తుంది. (నవ్వు)

అ : కొన్ని దృశ్యాలు భయంకరంగా ఉంటాయి. అవి గుర్తుచేసుకున్నా భయమే అంకుల్!

రో : మీకు తెలుసా? ప్రొఫెసర్ రాబర్ట్ ఎకాలజి మరియు పర్యావరణ శాస్త్రంలో నిపుణులు.

అ : (నవ్వుతూ) అలాగా! అయితే మామయ్య నుంచి మేము చాలా విషయాలు తెలుసుకోవచ్చు.

రా : చూడమ్మా అపూర్వా! పర్యావరణంలో వచ్చిన మార్పుల కారణంగా డైనోసార్లు భూమ్మీద అంతరించాయనేది శాస్త్రవేత్తల భావన. వాతావరణ మార్పుల కనుగుణంగా శరీరన్ని అలవాటు చేయలేకపోవడం కారణంగా అంతరించాయనేది వారి సిద్ధాంతం.

గ : రాబర్ట్! మరి నేటి పరిస్థితేంటి? పర్యావరణ సమస్యలు మరియు గ్లోబల్ వార్మింగ్, అదే భూమి వేడెక్కడం అనేది ఇప్పటికే పరిమితులు దాటుతున్నాయట కదా!

దీ : (భయంగా) అంటే మనం కూడా అంతరించిపోతామా? భూగోళం వేడెక్కడం అనేది పరిమితులు దాటడం పెద్ద సమస్య కదా? మానవ సమాజం ఉంటుందా? దీనిపై ఎవరూ మాట్లాడరేం?

అ : తమ్ముడూ! భూమి వేడెక్కడం ఇలాగే కొనసాగితే అలాంటి స్థితి వస్తుంది. ఆ స్థితి ననీలా ఉంటుందనేది ఊహకు కూడా అందని విషయమనుకుంటా!

కో : భయపడొద్దంద్రా! మనమందరం చేయి చేయి కలిపి అలాంటి స్థితిని తిప్పికొడ్దాం. సమస్య అర్థం చేసికొన్నాం. పరిష్కారాలున్నాయి. మన అభివృద్ధి నమూనాని మార్చుకోవాలి. పాలకులు, ప్రజలు చేయి చేయి కలిపి వనరుల దుర్వినియోగం ఆపితే చాలు. అన్నీ సర్దుకుంటాయి.

రా : దీనికోసమే 'మన్నికైన అభివృద్ధి' అనే మంత్రం జపిస్తున్నారందరూ!

దీ : మంత్రమా! మంత్రాలకు చింతకాయలు కూడా రాలవు కదా! (అందరూ నవ్వుతారు)

గ : అపూర్వా, దీక్షిత్! మామయ్య మన ఊరెందుకొచ్చారో తెలుసా? 'మన్నికైన అభివృద్ధి' గురించి అంతర్జాతీయ సదస్సు మన ఊర్లో జరుగుతున్నది. దాన్లో పాల్గొనటానికే వచ్చింది. మన్నికైన అభివృద్ధి అంటే పర్యావరణ విధ్వంసం లేకుండా అభివృద్ధి బాటపట్టడమే.

కో : అంటే పర్యావరణం భూగోళానికి సంబంధించి అనేక అంశాలను ఈ సమావేశంలో చర్చించి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు అన్వేషిస్తారు. అంతేకదా రాబర్ట్?

రా : అవును అంతే! శాస్త్రవేత్తలు పర్యావరణవేత్తలు కలిసి కూర్చొని సహజ వనరుల దుర్వినియోగాన్ని ఎలా ఆపాలి, జీవులు మనుగడ సాగించాలంటే పర్యావరణ

పరిరక్షణ తప్పనిసరి కాబట్టి అభివృద్ధికి కొత్తమార్గాలేంటి అనే విషయాలపై మా సదస్సు విస్తృతంగా చర్చిస్తుంది.

కో : గత నాలుగు దశాబ్దాలనుండి సమాజ వనరులను అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నాం. పర్యావరణాన్ని పూర్తిగా కలుషితం చేసే మార్గంలో ప్రయాణించాం. ఇప్పుడు అనుభవిస్తున్నాం.

అ : అవునమ్మా! ప్చ్! మనమే మన వాతావరణాన్ని విధ్వంసం చేస్తున్నాం. పరిమితులను దాటేసినట్లున్నాం. ఉదాహరణకు దీపావళికి మనం కాల్చే టపాసుల కాలుష్యం కారణంగా పెద్ద నగరాల్లో శ్వాస పీల్చడం కూడా కష్టమౌతున్నట్లు నిపుణులు నివేదికల్లో వెల్లడించారు.

రా : అపూర్వా! వాతావరణ కాలుష్యం గురించి నీకు మంచి అవగాహనే ఉంది. మంచి స్పృహ. నీలాగే అందరూ ఆలోచించగలిగితే ఈ సమస్యను అధిగమించడం పెద్ద కష్టమేమీ కాదు.

దీ : అప్పుడు అందరూ సంతోషంగా ఉంటారు. భూమి శతాబ్దాలుగా జీవుల మనుగడ కొరకు తపిస్తూనే ఉంది. భరిస్తూ కూడా ఉంది. కాని ఆధునిక మానవుడే...

రా : అవును. బాగా చెప్పావ్... గత రెండు శతాబ్దాల్లోనే ప్రపంచ జనాభా అనూహ్యంగా పెరిగింది. దాంతో వనరుల అవసరం పెరిగింది. అంతేకాకుండా ప్లాస్టిక్స్, సింథటిక్స్, రసాయన ఎరువులు, శిలాజ ఇంధనాల వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగి సమస్యను మరింత పెంచాయి. గవాంక్, మీరు చార్టర్ అకౌంటెంట్ కదా! మీరైతే ఈ లెక్కలు ఇంకా బాగా వివరించ గలరనుకుంటా!

గ : నేలతల్లి మానవులకు ఎంతో ఎంతెంతో ఇచ్చింది. ఇది మనందరికి తెలుసు కాని మానవుల యొక్క ఆశలు అత్యాశలుగా పెరిగిపోతున్నాయి. భూమి బావాలాంటిదని అనొచ్చు. వనరులు పరిమితం కాని దానిపై ఆశలేమో అనంతం. మన అత్యాశలతో వనరులను తోడేస్తున్నాము. ఒకరకంగా అసహజ అనవసర దోపిడి ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలకు ఉత్తచేతులే. (పిల్లలు చప్పట్లు చరుస్తారు).

రా : అవును పిల్లలూ! నాన్న చెప్పింది నిజం. మన సహజ వనరులన్నింటిని జుర్రేస్తున్నాం. కారణం, మన మితిమీరిన సౌఖ్యాలు, కోరికలు.

కో : మన అత్యాశలు ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. ఒక్క వాక్యంలో చెప్పాలంటే మానవ సమాజం చేత ప్రకృతి విధ్వంసం నిరాఘాటంగా జరుగుతోంది. పుడమిపై ప్రకృతి సమతుల్యత రావటానికి 8 లక్షల సంవత్సరాలు పడ్తే, విధ్వంసం మాత్రం శరవేగంగా జరుగుతోంది.

రా : ఇక మానవ మనుగడకు మిగిలిన ఏకైక మార్గం...

దీ : ఏంటి మామయ్యా అది? (ఆతృతగా)

రా : అదే 'మన్నికైన అభివృద్ధి పథం'. ఈ బాటలో మనం నీరు, గాలి, నేల లాంటి సహజ వనరుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తాము.

గ : గాంధిగారి మాటలు గుర్తుచేసుకోవాలి మనం.

దీ : మహాత్మాగాంధీ ఏం చెప్పారు నాన్నా?

అ : 'ప్రకృతి వనరులు మన అవసరాలు తీర్చడానికే గాని అత్యాశలు తీర్చడానికి కాదు' అని.

గ : ఇదే విషయాన్ని మన సామాజిక శాస్త్రాలు కూడా నొక్కిచెప్తున్నాయి. అవసరాల మేరకే వనరుల వినియోగం అదీ అందరికీ సమానంగా అందాలనేది.

అ : దీనిపై అంతర్జాతీయంగా ఏవైనా ప్రయత్నాలు జరుగుతున్నాయా?

రా : మంచి ప్రశ్న. నీ ప్రశ్నకు సమాధానం అవును, జరుగుతున్నాయి. బ్రెజిల్‌లోని రియోడిజెనీరియాలో 1992లో6 ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరిగింది.

దీ : ఆ సదస్సులో ఏం చర్చించారు?

రా : పేదరికం, వినిమయ సంస్కృతి, ఆరోగ్యం, పర్యావరణం, జీవవైవిధ్యం వంటి ముఖ్యమైన అంశాలను చర్చించారు. అన్ని దేశాలు ఒక అవగాహనకొచ్చాయి కూడా.

అ : ఏమని?

రా : మన్నికైన అభివృద్ధికి ప్రణాళికలు రచించాలని.

గ : అనుకున్న లక్ష్యాలు 2000–2015 నాటికి సాధించాలని నిర్ణయించారనుకుంటాను.

రా : అవును గణాంక్! అయితే ఆ ప్రయాణం అంత సులువైనది కాదు కూడా. చాలా అడుగులు వేయాల్సి ఉంది. భూమిని రక్షించుకోవటానికి ఎప్పటికప్పుడు వ్యూహాలు రచిస్తూనే ఉన్నారు. 2002లో కూడా జోహన్నస్‌బర్గ్‌లో అలాంటి సదస్సే నిర్వహించారు.

దీ : అంటే మీరు చెప్పే పద్ధతిలో అభివృద్ధి కొరకు తీవ్ర ప్రయత్నాలే జరిగాయి కాని ఫలితం మాత్రం అనుకున్న స్థాయిలో అందుకోలేదన్న మాట. విజయగాథ లేమీ లేవు.

గ : ఒరేయ్ దీక్షిత్! ప్రపంచం అంతా దీనికోసం కదలాలి. కొంత సమయం పడుతుంది. ఏ ఒక్కరి వల్ల సాధ్యమయ్యేది కాదు. అంతర్జాతీయంగా ఏకాభిప్రాయంతో కదలాలి. నువ్వో, నేనో మారి ప్రయోజనం లేదు. మనం మారాలి, ఇతరులు కలిసి రావాలి.

రా : ఐక్యరాజ్య సమితి 2015లో ప్రపంచ దేశాలన్నింటి కోసం ఒక అజెండా రూపొందించారు. దాని ప్రకారం 2030 నాటికి సాధ్యమవుతుంది. అన్ని దేశాలు గనక అజెండా ఆచరిస్తే ఖచ్చితంగా త్వరలోనే ఫలితాలు చూస్తాం. అనుమానం లేదు.

అ : మామయ్యా! మీరు చెప్పినట్లుగా మన్నికైన అభివృద్ధి కోసం యు.యన్.ఓ. రూపొందించిన అజెండాలోని అంశాలు మన దేశంలో ఆచరణలోకి వచ్చాయా?

రా : సూటి ప్రశ్న. మన నీతి ఆయోగ్ ఉంది కదా! దీనిపైనే పనిచేస్తున్నది. 17 సూత్రాల కార్యక్రమాన్ని మన్నికైన అభివృద్ధి కోసం రూపొందించారు. వీటిని మరలా 160 భాగాలుగా అంటే ఉప కార్యక్రమాల క్రింద విడగొట్టారు. ఇక్కడో ఆసక్తికర విషయమేమంటే అభివృద్ధి చెందిన లేదా అభివృద్ధి చెందుతున్న అనేదానితో సంబంధం లేకుండా అందరికీ ఉపయోగపడే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు.

కో : ఇంకో ముఖ్యమైన విషయమేమంటే సామాజిక, ఆర్థిక మరియు పర్యావరణాల మధ్య సమన్వయంతో ముందడుగు వేయడం.

దీ : అంటే అభివృద్ధి అంశాలను పర్యావరణ అంశాలు జోడించారన్న మాట. అంటే పర్యావరణ ప్రాధాన్యత పెరిగిందనేగా!

రా : అవును. ఈ 17 సూత్రాల కార్యక్రమ గొప్పదనం కూడా అదే. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న, వేధిస్తున్న సమస్యలు పేదరికం, ఆకలి, నిరుద్యోగం, విద్య, వైద్యం, లింగ వివక్ష, శిశు అభివృద్ధి, త్రాగునీటి లభ్యత, పరిశుభ్రత, సాంప్రదాయ ఇంధన వినియోగం, ఆర్థిక అసమానతలు, వాతావరణ మార్పులు, జీవవైవిధ్యం కాపాడడం, ప్రపంచ సంపద, శాంతితో సహా అన్ని అంశాలు ఇందులో పొందుపరచబడ్డాయి.

దీ : (నవ్వుతూ... వ్యంగయంగా) మన దేశంలో ప్రస్తుతం ప్రధానిచే పిలుపు నివ్వబడిన స్వచ్ఛ భారత్ నడుస్తుందిగా!

అ : (నవ్వుతూనే) తమ్ముడూ! అది దేశంలో జరుగుతున్న శుభ్రత కార్యక్రమం. ముందు నీ బ్యాగ్ సంగతి చూడు. అదో చెత్తబుట్ట. అవునా, కాదా?

గ : దీక్షిత్! నిజమేనా? అలా ఉంచుకోవడం మంచిది కాదు. ముందు మన ఇల్లు చక్కదిద్దుకున్న తర్వాత బయట సంగతి చూడాలి.

కో : అవున్రా దీక్షిత్! నాన్న చెప్పింది అక్షరాల నిజం. మనం శుభ్రత పాటిస్తేనే, స్వచ్ఛ భారత్‌లో పాల్గొని చెప్పి అర్హత లభిస్తుంది.

దీ : (మూలుగుతూ) అమ్మా! నువ్వు కూడా! అక్కా! నువ్వెప్పుడూ ఇంతే.. ఎప్పుడో ఒకసారి అలా గమనించింది. అప్పటినుండి నన్ను తప్పు పడుతూనే వుంది. కావాలంటే నా బ్యాగు చూడండి. అక్క బ్యాగ్ లాగే శుభ్రంగా వుంటుంది.

కో : ఆరోపణలు ప్రత్యారోపణలు వద్దు. శుభ్రంగా పెట్టుకుంటున్నావ్ కదా! దెన్ యు ఆర్ ఎ లవ్‌లీ బాయ్!

అ : తమ్ముడూ! సారీరా. అలా ఇంకెప్పుడూ అననులే.

(అందరూ నవ్వేస్తారు)

గ : వావ్! మన్నికైన అభివృద్ధి దిశలో ఒక అడుగు ముందుకు పడినట్లే. మరి మా దీక్షిత్‌లో మార్పు వచ్చిందంటే అదే శుభారంభం. బొగ్గుపులుసు వాయువుల విడుదల, శిలల ఇంధన వనరుల వినియోగం ప్రతి దేశం ఇతర దేశాలను తప్పు పట్టడమే గాని తమకు తాము తగ్గించే ప్రయత్నం చేయడం లేదు.

రా : ఎగ్జాట్లీ! బాగా చెప్పారు. మన్నికైన అభివృద్ధి అంటేనే ఒకరు అందరి కోసం, దాని ప్రదాన లక్ష్యమే అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, వనరులనూ సమానంగా వినియోగించేటట్లు చూడడం.

కో : సమాన అవకాశాలు – సమాన ఇంధన వినియోగం కోసం మన దేశంలో పెద్ద ఎత్తున పథకాలు రూపొందిస్తున్నారు.

రా : అవును నిజం. క్రిందిస్థాయి నుండి పైస్థాయి వరకు పరిశుభ్ర శక్తి లేదా గ్రీన్ ఎనర్జీని వినియోగించేటట్లు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు తెలుసా!

అ : మన ప్రభుత్వాలు సౌర, పవన శక్తి వినియోగం గురించి ఎందుకు వక్కాణిస్తున్నాయో నాకిప్పుడు అర్థమైంది మామయ్యా!

గ : 2030 నాటికి దేశంలోని ప్రతి ఒక్కరికి కోతలు లేని విద్యుత్ నిరంతరం అందించాలని ఆకాంక్షిస్తూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సాంప్రదాయేతర ఇంధనవ నరులు ఈ విషయంలో కీలక భూమికను నిర్వర్తిస్తాయి.

రా : గణాంక్‌గారూ! మరో ముఖ్య విషయం కూడా మనం గమనించాలి. ఏ విధంగానైతే ఆర్థిక లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహిస్తున్నారో అదేవిధంగా శక్తి వినియోగంపై కూడా ఆడిటింగ్ జరగాలని కోరుతున్నారు. నిపుణుల అభిప్రాయమేంటంటే విద్యుత్ ఉత్పత్తి కన్నా విద్యుత్ ఆదా లేదా పొదుపు అనేదే అత్యంత ప్రాముఖ్యమైన అంశం.

గ : ఒక యూనిట్ ఆదా చేస్తే ఇకటిన్నర యూనిట్ ఉత్పత్తి చేసినట్లుగా చదివాను నిజమే కదా!

కో : (నవ్వుతూ) ఆడిటర్‌ని అనిపించావ్! నువ్వు చెప్పింది నిజమే. ప్రొఫెసర్ రాబర్ట్! నిరంతర విద్యుత్ సాధించాలి అంటే ఇప్పుడున్న వ్యవస్థలన్నింటిని మార్చుకోవాలి కదా! కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి. అందుబాటులో ఉన్న సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రసార నష్టాలను పూర్తిస్థాయిలో తగ్గించాలి.

అ : మామయ్యా! నిజానికి మన అవసరాలు తీరడానికి అందుబాటులో ఉన్న విద్యుత్ సరిపోదు కదా! మా స్నేహితురాలింట్లో చూశా. వారి ఇంటి కప్పుపై సోలార్ ప్యానెల్స్ బిగించి సౌర విద్యుత్‌ను పొందుతున్నారు. అయితే సాంప్రదాయకంగా కొంటున్న విద్యుత్‌కన్నా సౌర విద్యుత్ మరింత ప్రియం అంట కదా!

రా : అవునమ్మా! అయితే నువ్వు చెప్పింది కొంతవరకే కరెక్ట్. లెడ్ దీపాలను వినియగోఇంచడం ద్వారా విద్యుత్ ఆదాచేయవచ్చు. సమీప భవిష్యత్తుల్లో సాంప్రదాయేతర ఇంధన ధరలు ఖచ్చితంగా తగ్గి సామాన్యులకు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ, దీనికోసం జాతీయ మిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది.

దీ : అంటే (ఆనందంతో) అందరికీ అందుబాటులోకి స్వచ్ఛమైన, తక్కువ ధరలో విద్యుల్ లభిస్తుందనే కదా! దీంతో కాలుష్య విద్యుత్, వనరుల దుర్వినియోగం ఉండదనే కదా!

రా : అంతేకాదు, మరో ప్రయోజనం కూడా జోడించబడింది. అది వ్యవసాయంలో విప్లవం.

అ : మామయ్యా! మనది వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ కదా! వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులంటే దాదాపు అన్నీ రంగాల్లో మార్పులుంటాయనే కదా!

కో : అందుకేగా గ్రీన్ టెక్నాలజీ మరియు రెండో వ్యవసాయ విప్లవం పైనే దృష్టంతా కేంద్రాకరిస్తున్నారు. నేల, నీరు, వాతావరణాలను కాలుష్యం చేయని విప్లవంగా దీనిని పరిగణించవచ్చు.

రా : అవును. దీనికోసమే జీవ ఎరువులను / సేంద్రియ ఎరువులను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు వేస్తున్నారు. దీనివలన నేల బలం కోల్పోదు. రసాయన ఎరువులు, క్రిమి సంహారులు విపరీతంగా వినియోగించి వాతావరణాన్ని, పుడమిని ధ్వంసం చేసేశారు.

గ : నిజం! రైతులు తెలిసో తెలియకో అదుపులేకుండా, విచ్చలవిడిగా రసాయన ఎరువులను, క్రిమి సంహాకరక మందులను ఉపయోగించి నేలను నాశనం చేస్తున్నారు. దీనివల్ల రైతు స్నేహ క్రిమికీటకాలు కూడా మరణిస్తున్నాయి. వీటి అవశేషాలు పంట దిగుబడులలోకి చేరి, అవి తిన్నవారికి కేన్సర్ సోకుతున్న సందర్భాలున్నాయి.

దీ : నాన్నా.. నాన్నా! క్రిందటి వారం మా పాఠశాలలో కూడా క్యాన్సర్‌పై అవగాహన సదస్సు పెట్టారు. క్యాన్సర్ సమస్య పంజాబ్ రాష్ట్రంలో అధికంగా ఉన్నట్లు గుర్తించారు. భటిండా, బైకనూరు మధ్య నడిచే రైతులకు క్యాన్సర్ రైలు అని పేరు ఎందుకంటే…?

అ : ఆ రైలులో ఎక్కువమంది రోగులు ప్రయాణిస్తూ ఉండి వుంటారు.

కో : అవున్రా! అక్షరాలా నిజం. ఎక్కువ మోతాదులో క్రిమి సంహారక మందులు, ఎరువులు వాడినందు వల్ల ఆ ప్రాంత ప్రజలు క్యాన్సర్ బారిన పడ్డారు. బైకనూరులో వైద్యం కోసమని ఆ రైల్లో వెళ్తుంటారు.

అ : బాప్‌రే! పిటియబుల్ ... వినడానికే బాధగా వుంది.

రా : ఈ పరిస్థితుల కారణంగానే మన్నికైన భద్రతతో కూడిన అభివృద్ధి పథకం 2030లో వ్యవసాయాన్ని కూడా చేర్చారు. ఇందులో కూడా జన్యు సంబంధ జీవవైవిధ్య సాంకేతికకు ప్రాధాన్యమిచ్చారు.

దీ : (గోముగా) కొంచెం విపులంగా...

రా : అంటే! వ్యవసాయానికి సంబంధించి సాంప్రదాయ జ్ఞానానికి నూతన సాంకేతికతను జోడించి కొత్త పద్ధతులు ప్రవేశ పెట్టడం. ఇప్పటికే భూసారానికి సంబంధించి 'భూసార ఆరోగ్య కార్డు పథకం' (సాయిల్ హెల్త్ కార్డు స్కీమ్) ప్రారంభించారు.

అ : ఈ పథకం ద్వారా ఏం చేస్తారు?

రా : నేలను పరీక్షిస్తారు. నేలలో ఉండాల్సిన లవణాలన్నీ ఉన్నాయా, లేదా చూచి ఒకవేళ ఏ ఖనిజ లవణాలు తక్కువగా ఉంటాయో వాటిని ఆ నేలకు అందించి నేల ఆరోగ్యంగా ఉండేటట్లు చూస్తారు.

కో : దీంతో పంట దిగుబడి పెరిగి రైతులు ఆర్థికంగా బలపడ్తారు. అంటే ఆదాయం పెరుగుతుంది. రైతు ఆత్మబలం పెరుగుతుంది. వారు పేదరికం నుంచి దూరమౌతారు. ఆత్మహత్యలుండవు. ఆహారభద్రత ఉంటుంది. పౌష్టికాహార లోప మరణాలు తగ్గుతాయి.

అ : కొంతమంది చేసే ఆహార వృథా చూస్తుంటే బాధేస్తుంది. ఒక ప్రక్క ఆహార వృథా, మరోప్రక్క ఆకలిచావులు.

గ : అవును తల్లీ! ఇలాంటి రుగ్మతలను సమాజం నుంచి పారద్రోలాలి. చైతన్యపరచి ఆహార వృథాని అరికట్టాల్సిన సమయం వచ్చింది.

దీ : నేను ప్రతిజ్ఞ చేస్తున్నా! ఇకమీదట ఏ రకమైన ఆహార వృథా చేయను. చేస్తుంటే చూచి ఊరుకోను (గంభీరంగా).

అందరూ : వావ్! గ్రేట్...! దీక్షిత్! మేమూ నీతో ఉంటాం. (చప్పట్లు)

గ : దీక్షిత్! నీ మాటలు వింటుంటే గర్వంగా ఉంది. నీవు గుర్తించిన విషయం పట్ల చాలామందికి స్పృహే లేదు. అందరికి చెప్పాలి.

అ : (గర్వంగా) నాన్నా! దీక్షిత్ ఎవరి తమ్ముడు మరి!!!! (అందరూ నవ్వేస్తారు).

గ : కొద్దిసేపు గ్రామాలను మరచి నగరాల గురించి ఆలోచిస్తే అనేకమంది ప్రజలు దుర్భర జీవనం గడుపుతున్నారు. మురికి వాడలలో, వసతుల లేఇమితో జీవితాన్ని సాగిఃస్తున్నారు. నిజంగా దౌర్భాగ్యం ఇది. మనమంతా సిగ్గు పడాల్సిన అంశం.

అ : అవును నాన్నా! నేను స్వయంగా చూచాను. మా కళాశాల విద్యార్థులం ఓ మురికివాడను సందర్శించి చూచాము. చాలామంది ఫుట్‌పాత్‌లపైనే పడుకుంటున్నారు. నిలువ నీడకూడా లేదు వారికి. వాడ మొత్తానికి ఒకే కుళాయి. ఆ కుళాయి చుట్టూ మురుగు. కొన్ని ఇళ్ళల్లో విద్యుత్ లేదు. మిణుగురు దీపాలలో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. పిల్లల పరిస్థితి దయనీయం. శుభ్రమైన బట్టలు లేవు. చింపిరి జుట్లు, ఏంటి ఈ స్థితి?

దీ : నేనైతే ఆ వాడలకు వెళ్ళను నాకు అసహ్యం.

కో : అది వారి తప్పు కాదు. ప్రజలు గ్రామాలు వదలి పట్టణాలకు రకరకాల కారణాలతో వచ్చేస్తున్నారు. నగరీకరణ యొక్క వికృతరూపంగా మురికివాడలు వెలుస్తున్నాయి. దీన్ని ఆపడం పాలకుల వల్ల కావడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా 'స్మార్ట్ సిటీ' అని క్రొత్త ప్రతిపాదనలు చేస్తున్నారు.

దీ : 'స్మార్ట్ నగరాలా'? పేరే ఏంటో కొత్తగా ఉందే. ఇదే స్మార్ట్ ఫోన్ మాదిరా? స్మార్ట్ ఫోన్‌లో అయితే ఒక్క మీట నొక్కితే అన్నీ విషయాలు తెలుసుకోవచ్చు. (నవ్వుతూ) నాన్నా! స్మార్ ఫోన్ ఇవ్వు!

గ : ఆహాహా! (అందరూ నవ్వేస్తారు)

రా : స్మార్ట్ నగరాల కాన్సెప్ట్ నీకు తెలుసా దీక్షిత్?

దీ : ఊహూఁ....!

రా : స్మార్ట్ సిటీ మిషన్ క్రింద తప్పనిసరిగా పరిశుభ్రమైన , తాజా త్రాగునీరు, పచ్చదనం-పరిశుభ్రత, పబ్లిక్ రవాణా, భూగర్భ విద్యుత్ లైన్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సౌకర్యం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో గృహాలు, విద్య-వైద్య సౌకర్యాలు, ఒకటేమిటి, అన్ని రకాలు అందుబాటులో ఉంటాయి. 2030 నాటికి ఇలాంటి నగరాలు నిర్మించాలనేది ప్రభుత్వ ఉవాచ.

గ : వినటానికి బాగానే ఉంది. సాధ్యమా అనేది ప్రశ్న.

కో : తప్పకుండా. 2030 నాటికి కొన్ని స్మార్ట్ నగరాలు ఏర్పడడం ఖాయం. మన్నికైన అభివృద్ధి ప్రణాళికలో ఇదొక భాగం. ప్రభుత్వం ఇప్పటికే 100 నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయటానికి గుర్తించారు. ఆ నగరాలలోని ప్రజలందరికి అందుబాటులో భరించ గలిగిన ధరల్లోనే అన్నీ లభ్యమౌతాయి.

గ : ప్రపంచ అనుభవం మరోలా ఉంది అని చదివా. కాని సంకల్పంతో అడుగులేస్తే సాధించ గలమేమో!

అ : ఈ నగరాల రూపకల్పనలో సాంకేతికతకు పెద్దపీట ఉంటుందనుకుంటా!

రా : నావు ఊహించింది అక్షరాల నిజం. టెక్నాలజీ కీలక భూమికను పోషిస్తుంది. అందరికీ టెక్నాలజీ, విద్య-వైద్యం అందుబాటులో ఉంటుంది. కాగితరహిత నగరాలుగా ఉంటాయి.

దీ : సమాజ పురోగమనానికి, మానవ ప్రగతికి విద్య-వైద్యం కీలకం అని అవి రెండూ ప్రజలకు అందుబాటులో చౌకగా లభిస్తే, అది మెరుగైన పరిపాలనకు సంకేతమని మా సాంఘిక శాస్త్ర పుస్తకంలో చదివా! (చప్పట్లు)

కో : (చప్పట్లతో అభినందిస్తూ) నువ్వు ఇవన్నీ చెప్పగలిగావంటే నీకు మంచి విద్యే లభిస్తుంది. (నవ్వు) అభివృద్ధి చెందిన దేశాలే కాకుండా ప్రగతి బాటలో ఉన్న దేశాలన్నీ ఈ సూత్రాన్ని పాటిస్తున్నాయి.

దీ : మన దేశంలో కూడానా?

కో : నూటికి నూరు శాతం కాకపోయినా ఆ దిశలో అడుగులు వేస్తున్నారు. అందరికీ అందుబాటులో ప్రాథమిక విద్యను తెచ్చారు. దీనికోసం 'విద్యా హక్కు చట్టం' తెచ్చారు.

గ : కోమలీ! రాబర్ట్‌కి అల్పాహారం మరచావా? మాటల్లో అసలు మర్యాదలు మరచినట్లున్నావ్... కాఫీ చేసుకు రానా?

అ : నాన్నా! మామయ్యకి కాఫీ....!

దీ : అమామ! మీకు కాఫీ మరి మాకో....?

అ : పాలు!!

దీ : నాకు తింటానికి కావాలి కోడి కాని కోడి.. అదే పకోడి కావాలి (నవ్వుతూ)

కో : ఓకే! మీరందరూ మాట్లాడుకుంటూ ఉండండి. ఇలా వెళ్ళి అలా తెచ్చేస్తా!

గ : శ్రీమతీ! నేనూ వస్తున్నా. పద.

రా : మన్నికైన అభివృద్ధి కొరకు నిర్దేశించుకున్న లక్ష్యాలలో మరో అంశం – అదే ఆరోగ్యం గురించి మాట్లాడుకుందాం. ఆరోగ్య రంగంలో శిశు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకొన్నారు. మీరు ఆశ్చర్య పోతారు ఆఫ్రికాలోని సబ్–సహారా ప్రాంతంలో 1700 మంది పుట్టకుండానే చనిపోయారు.

దీ : అమ్మో! అంతమందా?

అ : నిజంగానే ఆశ్చర్యంగా ఉంది మామయ్యా!

రా : ప్రతి పదిమందిలో ఒకరు 5వ పుట్టిన రోజు జరుపుకోకుండా మరణిస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే 15 రెట్లు ఎక్కువ.

అ : అంటే శిశుమరణాలు తగ్గించడం కూడా ప్రపంచానికి పెద్ద సవాలులాగా ఉందే!

రా : అవును. అయితే గత రెండు దశాబ్దాలలో కొంత మెరుగుపడింది పరిస్థితి. గర్భిణి స్త్రీల సంరక్షణ, సుఖ ప్రసవాల కోసం పథకాలు రచిస్తున్నారు.

అ : ఈమధ్య ప్రజానీకం అనేక రకాల క్రొత్త జబ్బులు, ఉదాహరణకు డెంగ్యూ, గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వాటితో సతమతమవుతున్నారు కదా!

రా : అవును. ఎయిడ్స్, మలేరియా, టిబిలాంటి జబ్బులను అదుపు చేయడం కూడా అభివృద్ధి లక్ష్యాలలో ఉంది. ఈ విషయంలో బయోటెక్నాలజీ కీలకపాత్రను పోషిస్తుంది. గత దశ్శాబ్దంలో మలేరియాతో పది లక్షలకు పైగా చనిపోయారంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. అదే సందర్భంలో కోటి మందిని టి.బి. నుండి రక్షించుకున్నాం.

దీ : మామయ్యా! మలేరియా అంటే చచ్చేంత భయం. పోయిన సంవత్సరం దాని ప్రభావమేంటో రుచిచూచా. కోలుకోడానికి కొన్ని వారాలు పట్టింది.

రా : వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేయించుకోవడం కన్నా రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్న విషయం అందరికీ తెలుసు.

అ : ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్ అంటారు కదా?

రా : కాని ఆచరించం. దోమలు గుడ్లు పెట్టడానికి అనుకూల వాతావరణం ఏర్పరిస్తే వ్యాధులు రాకుండా నివారించవచ్చు. దానికోసం నిల్వ నీరు లేకుండా చూచుకోవాలి.

దీ : అంటే దోమల స్థావరాలను విధ్వంసం చేయాలి. (గంభీరంగా)

(నడుస్తూ వస్తూ ఉన్న శబ్దం, ప్లేట్ల చప్పుడు)

గ : (నడుస్తూ) వర్షపు నీరు అనేక సమస్యలకు మూలం.

కో : కొంచెం సవరణ. నిలిచిపోయిన వర్షపు నీరు అంతేకాని వర్షపు నీరు కాదు.

రా : అవును.

అ : అంటే వర్షాలు పడినపుడు చిన్న చిన్న గుంటల్లో, టైర్లలో, ఖాళీ కొబ్బరి బోండాంలలో, పగిలిపోయి సగం మిగిలిన పాత్రలలో, పారుదల లేని మురుగు కాలువల్లో నిలువ ఉండే నీరే కదా! దోమల ఉత్పత్తి కేంద్రాలు.

కో : మీకందరికీ కాఫీ రెడీ.

దీ : నా సంగతేంటమ్మా! అల్పాహారం, అడిగింది చేశావా?

అ : తమ్ముడూ! కొంచెం ఓపిక పట్టు. అన్నీ లభిస్తాయి. (చప్పుళ్ళు – తింటున్న శబ్దం)

గ : ఇంకా విపత్తులు అనేకం ఉన్నాయి కదా!

రా : అవును. అందుకేగా 2030 నాటికి ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోడానికి సన్నద్ధంగా ఉండేట్లు ఆలోచిస్తున్నారు. క్రొత్తగా వస్తున్న సాంకేతిక రంగాన్ని పూర్తిగా వినియోగించాల్సి ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రణాళికలు రచించుకోవాలి.

అ : ప్రొఫెసర్ మామయ్యా! నాకు గత రెండు తుఫాన్లు... అదే హుద్‌హుద్, ఫైలిన్‌ల తేదీలు గుర్తున్నాయి. భారత వాతావరణ పరిశోధనా కేంద్రం ముందస్తుగా వాటిని అంచనా వేసి తెలియపరచినందున ప్రభుత్వం అప్రమత్తమయింది. దాంతో అనేకమందిని బ్రతికించుకో గలిగాము.

రా : గ్రేట్ అపూర్వా! బాగా గుర్తు పెట్టుకున్నావ్. లోకజ్ఞానం బాగావుంది. భేష్! సాంకేతిక వ్యవస్థ బాగా అభివృద్ధి అయినందున వాతావరణ మార్పులను సరిగ్గా, ముందస్తుగా అంచనా వేయగలుగుతున్నాము.

గ : ఇప్పుడు సునామిలాంటి భయంకరమైన ప్రకృతి విపత్తులను ముందస్తుగా తెలుసుకోగలిగే సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసుకొన్నాం. నవంబర్ 2016లో జపాన్ ముందస్తుగా అప్రమత్తమైన కారణంగానే వేలాది ప్రాణాలు కాపాడగలిగారు.

రా : వీటన్నింటికి తోడుగా మన్నికైన అభివృద్ధి పథకాలలో సముద్ర శాస్త్ర అభివృద్ధిని కూడా కలిపారు. అందరూ, అన్ని విబాగాలు కలిసి పనిచేస్తేనే మన్నికైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

కో : ఖచ్చితంగా... మినహాయింపులు ఏవి. ఎవరికి, ఏ స్థాయిలో కూడా ఉండవు. చిన్నా, బన్నీ అర్థమైందా? ప్రకృతిలో ప్రతిదీ విలువైనదే. దేన్నీ తాత్సారం చేయకూడదు. ఉపేక్షించకూడదు. అప్పుడు భావితరానికి మంచి భవిష్యత్తును అందించగలము.

రా : శీతోష్ణస్థితి క్రమబద్ధంగా ఉండచడంలో సముద్రాలు కీలకం. చేలప మనుగడ దీనిపైనే ఆధారపడి ఉంటుంది.

అ : సముద్రాలలో ఉండే పెద్ద జలచరం వేల్ మాత్రమే కదా?

దీ : నేలమీద తిరిగింది డైనోసార్, ఇది వేల్ కన్నా చాలా పెద్దదయి ఉంటుంది కదా!

అ : తెలివితక్కువగా మాట్లాడకు. ప్రస్తుతం మాత్రం జీవించి వున్నవాటిలోకి పెద్దది తిమింగలమే.

దీ : అక్కా! ప్రపంచంలో అత్యంత దయగల జీవి ఏదో తెలుసా? ఇంకెవ్వరు నువ్వే.

కో : ఏంట్రా అల్లరి? ఇంతలో పోట్లాట, అంతలోనే ప్రేమ, దయ.

గ : ఇలాంటి ఆప్యాయత, ప్రేమ, దయని / నేలతల్లిప చూపితే దీనిమీద కొన్ని తరాల వరకు జీవులు మనుగడ సాగించగలవు. పచ్చదనం-పరిశుభ్రతతో భూమిని కాపాడుకోవాలి.

రా : పిల్లలే కాదు, ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలి. ప్రకృతి పట్ల అవగాహనతో మసలుకోవాలి. మనం లేకుండా భూమి మనుగడ ఉంటుంది కాని భూమి లేకపోతే మనకు మనుగడ లేదన్న సత్యాన్ని అందరూ గ్రహించి మసలుకోవాలి. (అందరూ కలిసి ఏకకంఠంతో)

మన్నికైన అభివృద్ధి కొరకు మా వంతు భూమికను నిబద్ధతతో పాటిస్తామని, పుడమిని పచ్చదనం-పరిశుభ్రతతో ఉంచుతామని, అవసరం మేరకే వనరులను వినియోగిస్తామని, మనసా, వాచా, కర్మణా - త్రికరణ శుద్ధితో ప్రతిజ్ఞ చేస్తున్నాము.

**<u>టైటిల్ సాంగ్</u>**

**క్విజ్ :**

**(1) స్మార్ట్ సిటీ పథకం క్రింద భారత ప్రభుత్వం మొదటి దశలో ఎన్ని నగరాలను ఎంపిక చేసింది?**

**జ. 100 నగరాలు.**

**(2) శిశుమరణాలు లేదా పురిట్లోనే బిడ్డలు మరణిస్తున్న ప్రాంతం ఏది? అది ఏ ఖండంలో ఉంది?**

**జ. సబ్-సహారా ప్రాంతం. ఆఫ్రికా ఖండంలో వుంది.**